క్లుప్తంగా

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో కొల్లాపురమ్మ మూలవిరాట్

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారికి ప్రధాన అర్చకులు ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మూగ జీవాలను అమ్మవారికి బలి ఇచ్చారు.

గంగమ్మకు ఉప్పదేవర


బత్తలపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న రజకులు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో మంగళవారం రజకుల ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి ఉప్పదేవర నిర్వహించారు. ప్రతి రజక కుటుంబం నుంచి ప్రత్యేకంగా ధాన్యం కొంత అమ్మవారికి కేటాయించి ఊరేగింపుగా గ్రామంలోని ప్రతి దేవుని గుడికీ వెళ్లి పూజలు చేశారు. అనంతరం చెరువు సమీపంలోని గంగమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మూగ జీవాలను అమ్మవారికి బలి ఇచ్చారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: కంచరవాండ్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దాదిమి లక్ష్మీరెడ్డి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భర్త శివశంకర్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త విశ్వనాథరెడ్డి, నాయకులు ఆదినారాయణ, రంగారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకటేష్, మాధవరెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముష్టికోవెలలో వైద్య శిబిరం


బాధితులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ముష్టికోవెలలో సోమవారం వినాయక నిమజ్జనం సందర్భంగా పులిహోర తిన్న భక్తులకు ఫుడ్‌పాయిజన్ అయింది. పలువురికి తీవ్రమైన కడుపునొప్పి వాంతులు, విరేచనాలు కావడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. బాధితులు చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. మంగళవారం విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మంజువాణి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఎన్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీ డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో బాధితులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా వైద్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆదేశించారు. ఈ శిబిరంలో పలువురు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ వేయని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని జెడ్పీటీసీ కోటి సుధ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వ్యవసాయ గోడౌన్‌లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ సాగు కోసం ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఏఓ ఓబిరెడ్డి మాట్లాడుతూ 80 శాతం సబ్సిడీ పోను ఉలవ (పది కేజీలు)కు రూ.174, పెసలు(నాలుగు కేజీలు)కు రూ.104, అలసంద (పది కేజీలు)కు రూ.226 చొప్పున రైతు సేవా కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు.

శుద్ధ అబద్ధం

ప్రజల అవసరాలే వారికి ఆదాయ వనరుగా మారుతోంది. ప్రభుత్వం సరఫరా చేసే నీరు తాగడానికి ఆమోదయోగ్యంగా లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో శుద్ధి జలాలపై ప్రజలు ఆధారపడుతున్నారు. అయితే అనధికారికంగా ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు శుద్ధిజలాల తయారీలో ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటించడం లేదు. అయినా సాధారణ నీటికి అసాధారణ రీతిలో డబ్బు వసూలు చేస్తున్నారు.

- ఫిల్టర్ నీరు.. అంతా భ్రమ
- నామమాత్రంగా శుద్ధి చేసి సరఫరా
- అనారోగ్యాలతో ప్రజలకు తప్పని అవస్థలు
- అనధికారిక వాటర్ ప్లాంట్లను పట్టించుకోని అధికారులు


కదిరిలోని ఓ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్


క్యాన్‌లోకి నీటిని వదులుతున్న ఫిల్టర్ వాటర్ విక్రయదారుడు

కదిరి టౌన్: కదిరి మున్సిపాలిటీ పరిధిలో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్లాంట్లు విచ్చలవిడిగా ఏర్పాటవుతున్నాయి. ఒకప్పుడు మినరల్ వాటర్ తాగడం అనేది కొంతమందికి స్టేటస్ సింబల్‌గా ఉండేది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అటువంటి నీటినే వాడుతున్నారు. రూ.2కే వాటర్ ప్యాకెట్, రూ.10కు 20 లీటర్ల క్యాన్‌తో పాటు 250 ఎంఎల్, 500 ఎంఎల్, లీటర్ బాటిళ్లను విక్రయిస్తున్నారు. ప్లాంట్లలోనే కాదు కిరాణా దుకాణం నుంచి హోటళ్లు, రెస్టారెంట్లు, కూల్‌డ్రింక్స్ షాపులు ఎక్కడికి వెళ్లినా వివిధ పేర్లతో నీళ్ల విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. కొందరు ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలను పోలిన పేర్లు పెట్టుకుని సులువుగా నీటి వ్యాపారం చేసుకుంటున్నారు. ఉప్పులు లేకుండా.. సప్పగా లేకుండా కాస్త రుచిగా కనిపిస్తుండటంతో ఈ నీటిని ప్రజలు వినియోగిస్తున్నారు. కానీ వారు అనుకుంటున్నట్టు ఆ నీరు సురక్షితమైనది అయితే కాదు.

నీటి నాణ్యతపై పర్యవేక్షణేదీ?

పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. ఇక్కడ వందకు పైగా ప్యూరిఫైడ్ పేరుతో వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. జనరల్ వాటర్‌నే మినరల్ వాటర్ అంటూ విక్రయాలు సాగిస్తున్నా సంబంధిత విజిలెన్స్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. రోగాలు అధికంగా ప్రబలే వర్షాకాలంలో తాగు నీటిని నాణ్యతతో సరఫరా చేయడానికి ఎక్కడికక్కడ శాంపిల్స్ సేకరించి పరీక్షలు జరపాల్సి ఉంటుంది. అయితే పట్టణంలో ఎక్కడా అలాంటి దాఖలాలు కనిపించడం లేదు.

ఈ నీరు తాగితే అంతే...

వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు కలుషిత భూగర్భ జలాలనే నామమాత్రంగా శుద్ధి చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ నీళ్లకు అలవాటు పడిన ప్రతి ఒక్కరూ మినరల్ వాటర్ తాగుతున్నామన్న భ్రమలో ఉంటున్నారు. క్రమేణా శరీరంలో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు ఈ నీటి వల్లేనని మాత్రం గ్రహించలేకపోతున్నారు. కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పుల నుంచి జీర్ణ ప్రక్రియ సమస్య, డయేరియా, జలుబు, దగ్గు, ఇతర దీర్ఘకాలిక సమస్యలు, విషతుల్య కారకాలు శరీరంలో పేరుకుపోవడం వంటి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

ప్లాంటు నిర్వహించాలంటే...

ప్లాంట్లలో భూగర్భ జలాలను వాణిజ్య అవసరాలకు వినియోగించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల వారు అయితే తహసీల్దార్, మున్సిపల్ పరిధిలో అయితే మున్సిపల్ కమిషనర్ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. చాలా వరకు వాటర్ ప్లాంట్లు పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇక ప్యాకింగ్ విషయానికి కొస్తే బాటిల్‌పై బ్రాండ్ పేరు తప్ప బ్యాచ్ నంబర్, కోడ్, ప్రాసెసింగ్ తేదీలు కనిపించవు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, పరిశ్రమల శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు, ఇతర ముఖ్యమైన సర్టిఫికెట్‌లు లేకుండానే పట్టణంలో ప్లాంట్లన్నీ అనధికారికంగా నడుస్తున్నాయి.

నిబంధనలు పాటించకపోతే మూసేస్తాం



నిబంధనలు పాటించని వాటర్‌ప్లాంట్లను మూసివేస్తాం. అలాంటి ప్లాంట్ల నుంచి సరఫరా అయ్యే నీరు తాగడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కచ్చితంగా ప్లాంట్లను తనిఖీలు చేస్తాం.

– మురళీకృష్ణ, తహసీల్దార్

పచ్చని చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ


చీనీ తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పచ్చని మొక్కలు, చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీయాన్ అగ్రి సొల్యూషన్స్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వాహనాలు వదిలే పొగ, చెట్లను నరికి నిప్పు పెట్టడంతో వెలువడే విపరీతమైన పొగలో గాలి కలుషితమవడం వల్ల వర్షపాతం తగ్గి రైతుల మనుగడకు తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు శ్రీయాన్ సంస్థ చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమం అభినందనీయం అన్నారు. అనంతరం ఆ సంస్థ వారు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, పాల కాటమయ్య, వేణుగోపాల్ తదితర రైతుల చీనీ తోటల్లో పర్యటించి చెట్ల పెంపకంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఆర్‌బీఎం సుబ్బన్న, రైతులు హరి, లక్ష్మన్న, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడండి

తనకల్లు: మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ బొంతలపల్లి, బాలసముద్రం, కొక్కంటిక్రాస్ వద్ద ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు తెలిపారు.

నేడు కదిరిలో గణేశ్ నిమజ్జనం


వినాయకుడి నిమజ్జనం చేసే రామనారాయణకుంట ఇదే..

కదిరి: వివిధ రూపాల్లో కొలువుదీరి విశేష పూజలందుకున్న వినాయక విగ్రహాలను ఐదో రోజు బుధవారం నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు కదిరిలోని గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో పాటు అధికారులు నిర్ణయించారు. ఈసారి కదిరి మండలం సున్నపుగుట్టతండా సమీపంలో ఉన్న రామనారాయణ కుంటలో నిమజ్జనం చేసేందుకు అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. గతంలో పట్టణానికి చెందిన హిందూ, ముస్లింలు కలిసి చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈసారి కూడా ఆలంఖాన్ వలి మసీదు ముందు గుండా శివాలయం, సింహకోట, ఎర్రకోటతో పాటు రైల్వే గణేష్ విగ్రహాలను మాత్రమే ఆ దారి గుండా వెళ్లేందుకు పోలీసులు అనుమతిస్తారు. మిగిలిన విగ్రహాలన్నీ హిందూపూర్ సర్కిల్ మీదుగా నేరుగా కోనేరు సర్కిల్ చేరుకోవాల్సి ఉంటుంది. బుధవారం ఉదయం 11 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద నుంచి విగ్రహాల శోభాయాత్ర ప్రారంభమవుతుంది. ఈ యాత్ర ఇందిరాగాంధీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా హిందూపూర్ సర్కిల్ చేరుకుంటుంది. అక్కడి నుంచి కోనేరు సర్కిల్ మీదుగా హిందూపూర్ రోడ్ నుంచి రామనారాయణ కుంట చేరుకుంటాయి. అక్కడ విగ్రహాలను అధికారులకు అప్పగిస్తే వారు నిమజ్జనం చేయిస్తారు.

ట్రాఫిక్‌పై ఆంక్షలు

గణేశ్ నిమజ్జనం సందర్భంగా పట్టణ పోలీసులు ట్రాఫిక్‌పై ఆంక్షలు విధించారు. బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలను ఎంపీడీఓ ఆఫీస్ వరకే అనుమతిస్తారు. మదనపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు గజ్జలరెడ్డిపల్లి వరకు, అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలను కుటాగుళ్ల వరకు, పులివెందుల వైపు నుంచి వచ్చే వాహనాలను కుటాగుళ్ల వరకు మాత్రమే అనుమతిస్తారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా అన్ని వైపులా నుంచి వచ్చే వాహనాలను కదిరిలోకి అనుమతించే ప్రసక్తే లేదని డీఎస్పీ శ్రీలత తెలిపారు. వినాయక విగ్రహాలను తీసుకెళ్లే వాహనాల్లో చిన్న పిల్లలు లేకుండా చూసుకోవాలన్నారు. శోభాయాత్రలో డీజే శబ్దాలు ఉండకూడదని, ఈ బాధ్యత ఆయా ఉత్సవ కమిటీ సభ్యులే చూసుకోవాలని సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శోభాయాత్రలో అల్లర్లకు పాల్పడి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిమజ్జనానికి భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఆకలి కేకలు పట్టని సర్కారు

- వరద బాధితుల ఉసురు తప్పక తగులుతుంది
- వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త మక్బూల్ అహ్మద్





కదిరి: విజయవాడ వరద బాధితుల ఆకలి కేకలు కూటమి సర్కార్‌కు పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ విమర్శించారు. పునరావాస, సహాయక చర్యలు అద్భుతంగా చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా.. అవి పూర్తిస్థాయిలో బాధితులకు చేరడం లేదన్నారు. మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు అధికార కూటమి నేతలు బాధిత ప్రాంతాల్లోనే మకాం వేశారని మీడియాలో ఊదరగొట్టడమే తప్ప బాధితులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. విజయవాడలోని పద్మావతి ఘాట్ నుంచి యనమలకుదురు వరకు నదిని ఆనుకొని గత వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.474.51 కోట్లతో 5.66 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించకపోతే ఇప్పుడు పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటేనే భయమేస్తోందన్నారు. కరకట్టపై అక్రమంగా నిర్మించిన చంద్రబాబు ఇల్లు మునిగిపోతుందన్న ఒకే ఒక్క కారణంతోనే... విజయవాడకు ముంపు ముప్పు వాటిల్లిందని ఆయనకు పేదల ఉసురు తగలకమానదని అన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో వేలాది మంది బాధుతులు ఆకలి కేకలు పెడుతున్నా ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదని మండిపడ్డారు. వరదలపై ప్రజలను అప్రమత్తం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బాధితులను ఆదుకోవడం పక్కనబెట్టి వరదల పేరుతో చంద్రబాబు సర్కారు వసూళ్లకు పాల్పడటం మరీ దారుణమన్నారు. ఒక్కో డ్వాక్రా సంఘం రూ.500 నుంచి రూ.1000 ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడం కరెక్ట్ కాదన్నారు.

వధశాలలోని గోవులకు విముక్తి


గోవధశాల వద్ద వీహెచ్‌పీ సభ్యుల ఆందోళన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న గోవధ శాలను విశ్వహిందూ పరిషత్ సభ్యులు మంగళవారం అడ్డుకున్నారు. గోవులు, లేగదూడలను వధించేందుకు సిద్ధం చేసి ఉండటంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం గోవధశాల నిర్వహిస్తున్న వారిని సీఐ పిలిపించి చట్టాల గురించి వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గోవధ శాలను నిర్వహించరాదని హెచ్చరించారు. అనంతరం సీఐ సమక్షంలో గోవులు, లేగదూడలకు విముక్తి కల్పించి రైతులకు అందించారు. గోవధశాలను అడ్డుకున్నవారిలో విశ్వహిందూ పరిషత్ అనంతపురం విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, జిల్లా గోరక్ష ప్రముఖ్ నరసింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోలిశెట్టి వెంగముని, నగర కార్యదర్శి దేవరకొండ రామానుజులు, న్యాయవాది బిల్లే రవి, స్థానిక కాలనీవాసులు ఉన్నారు.

వరద బాధితులకు సరుకుల వితరణ


నిత్యావసర సరుకులు తరలిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: విజయవాడలో వరదల కారణంగా ఎంతోమంది నిరాశ్రయులయ్యారు. చలించిపోయిన చాలామంది మానవతావాదులు విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగా ముదిగుబ్బకు చెందిన వెల్డింగ్ షాపు యజమాని రమేష్ వరద బాధితుల సహాయార్థం రూ.2.50 లక్షల విలువైన నిత్యావసర సరుకులను వితరణ చేశారు. కార్యక్రమంలో గంగులప్ప, హరీష్‌కుమార్, లింగమయ్య, నాగేంద్ర, కేశవ, రామాంజి, నారప్ప, మురళి, గంగరాజు, నాగరాజు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు: రాకుంటపల్లి క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అమడగూరు మండలం గువ్వలపల్లికి చెందిన అమృత మంగళవారం తన స్కూటీలో సీఆర్ పల్లికి బయల్దేరింది. అదే సమయంలో ఉప్పువాండ్లపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, నర్సిరెడ్డి వ్యక్తిగత పని మీద బైక్‌పై అమడగూరుకు వెళ్తున్నారు. రాకుంటపల్లి మలుపు వద్దకు రాగానే వీరి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అమృతకు తలకు, మహేశ్వర్‌రెడ్డి తల, ముక్కుకు బలమైన గాయాలయ్యాయి. నర్సిరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్లాలి


గొట్లూరులో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: తెలంగాణ భూపోరాట ఉద్యమ నాయకురాలు చాకలి చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో ముందుకెళ్లాలని రజకులకు నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం గొట్లూరులో జిల్లా రజక అభివృద్ధి సంస్థ పట్టణ శాఖ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అగ్రహారం ముత్యాలు ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చాకలి ఐలమ్మ చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. బోనాలు తలపై పెట్టుకొని గంగమ్మ దేవతకు పూజలు చేశారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ పోలుగల్లు కమ్మన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ పార్వతి, పట్టణ అధ్యక్షులు న్యామద్దల నరసింహులు తదితరులు ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు, శేఖర్, రామాంజి, ఆదెప్ప, గంగాధర్, వరలక్ష్మి, పద్మావతి, శాంతమ్మ, సుజాత పాల్గొన్నారు.

తలుపుల : కుమ్మరపేట సమీపంలోని దోబీ ఘాట్ వద్ద మంగళవారం మండల రజక సంఘం అధ్యక్షుడు జి.వి రమణ, ఉపాధ్యక్షులు రవి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. తొలుత రజకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు నారాయణ, నాగేంద్ర, పురుషోత్తం, రాంప్రసాద్, రాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

కదిరి టౌన్: బీసీ రాష్ట్ర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చింత నాగరాజు ఆధర్యంలో బీసీ ఉద్యోగులు మంగళవారం కదిరిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చింత నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ భూపోరాట ఉద్యమంలో ఆమె క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో రామచంద్ర యాదవ్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, సాయి, శీనా, నరసింహ, శంకర్, శివశంకర్, గంగన్న, బాపనపల్లి శ్రీనివాసులు, రామమోహన, ఎస్‌టీయూ, ఎర్రగుడి రామాంజి, భోజనం శ్రీనివాసులు, పట్నం హరి, రామ్‌కుమార్, ఏపీటీఎఫ్ నారాయణ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: తెలంగాణా పోరాట యోధురాలు వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ముదిగుబ్బలో ఘనంగా నిర్వహించారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ సాయుధ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ సెక్రటరి జనరల్ కమ్మన్న, జిల్లా చైర్మెన్ నల్ల చెర్లోపల్లి నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి ఎక్కలూరు రంగనాథ్, రజక ఉద్యోగుల సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఆర్టీసీ గోపాల్, పట్టణ కార్యదర్శి సింగారం సాయి ప్రసాద్, కూడేరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గణనాథునికి ఘనంగా వీడ్కోలు


తనకల్లులో నిమజ్జనానికి ఊరేగింపుగా..


ఎన్పీకుంటలో నిమజ్జనానికి తరలిన గణనాథులు


నల్లచెరువులో భారీ వినాయకుడు


ఓడీ చెరువులో బారులు తీరిన గణపయ్యలు


తాడిమర్రిలో వినాయక నిమజ్జన శోభాయాత్ర

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రితో పాటు పిన్నదరి, కునుకుంట్ల, దాడితోట, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, నిడిగల్లు తదితర గ్రామాల్లో నాలుగు రోజులపాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్యలకు మంగళవారం వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు తదితర వాహనాల్లో వినాయక విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నీటిలో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎన్పీకుంట: మండల కేంద్రం ఎన్పీకుంటలోని పెడబల్లి బజారు, బక్కిరెడ్డి బజారులో కొలువుదీర్చిన వినాయక విగ్రహాలను మంగళవారం పురవీధుల్లో ఊరేగించి శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేసి గెలిచిన వారికి రూ.2,016 బహుమతిని ప్రదానం చేశారు. వినాయక కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తనకల్లు: మండల కేంద్రంలోని దళితవాడ, ఇందిరానగర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జై గణేష్ మహరాజ్‌కీ జై....గణపతి బప్పా మోరియా అంటూ యువకులు నృత్యాలు చేసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం పాపాఘ్ని నది, సీజీ ప్రాజెక్టుల్లో బొజ్జ గణపయ్యలను నిమజ్జనం చేశారు.

ఓడీచెరువు : మండల కేంద్రంలోని పలు వీధుల్లో కొలువైన గణేశ్ విగ్రహాలను మంగళవారం నిమజ్జనం చేశారు. విగ్రహాలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి.

నల్లచెరువు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి చర్యలు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ సబ్జెక్టుకు అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. ఎంఏ హిందీలో 50 శాతం అంతకంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.